సిద్దిపేట మున్సిపల్

ఆర్వో బదిలీ

- ఆస్తిపన్ను విధింపులో చేతివాటం
- వరుస కథనాలు ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి'
- విచారణ చేపట్టాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌కు సీడీఎంఏ ఆదేశాలు
- సిద్దిపేట మున్సిపల్ నుంచి తూప్రాన్‌కు బదిలీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూన్ 27: సిద్దిపేట మున్సిపల్‌కు ప్రధాన ఆదాయ వనరులైన ఆస్తిపన్ను విషయంలో డబ్బుకు కక్కుర్తి పడి ఖజానాకు గండికొట్టేలా వ్యవహరిస్తున్న మున్సిపల్ రెవెన్యూ అధికారిపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని భవనాలు, అపార్ట్‌మెంట్‌లు, వాణిజ్య భవనాలకు ఆస్తి పన్ను విధించడంలో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణల నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. అందులో భాగంగానే పూర్తి విచారణ చేపట్టాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌ను సీడీఎంఏ, ఉన్నతాధికారులు ఆదేశించారు. విచారణ చేపట్టిన సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ నివేదికను సీడీఎంఏకు అందజేశారు. నివేదిక ఆధారంగా సిద్దిపేట మున్సిపల్ ఆర్వోగా విధులు నిర్వర్తించిన బి.శ్రీకాంత్‌ను తూప్రాన్ మున్సిపల్‌కు బదిలీ చేశారు. రామాయంపేట మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వరిస్తున్న ఎం. శ్రీనివాస్‌ను సిద్దిపేటకు బదిలీ చేశారు.



వన్ డే టూర్ ప్యాకేజీతో ఏర్పాటు చేసిన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో అధికారులు

పర్యాటక కేంద్రాలు, పుణ్యక్షేత్రాలకు

ప్రత్యేక బస్ ప్యాకేజీ

- రూ. 360తో జిల్లాలో వన్ డే టూర్
- ప్రారంభించిన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో అధికారులు

వర్గల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, పుణ్యక్షేత్రాల సందర్శనార్థం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్‌డిపో అధికారులు నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. రూ.360తో జిల్లాలో ఉన్న పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలు సందర్శించడం కోసం వన్ డే టూర్ ప్యాకేజీ పేరుతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో నుంచి శుక్రవారం ప్రారంభించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో నుంచి ఉదయం 8.00 గంటలకు ప్రయాణికులతో బస్సు బయలుదేరి మొదట వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహ్మా స్వామి క్షేత్రం, అక్కడి నుంచి వర్గల్ విద్యాధరి క్షేత్రం, కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం, అక్కడి నుంచి కొమురవెల్లి అష్టదశ శక్తి పీఠాలు, సిద్దిపేట కోమటి చెరువును సందర్శించి రాత్రి 7.00 గంటలకు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్ డిపో వద్ద దింపే విధంగా వన్ డే టూర్ ప్యాకేజీతో ఏర్పాటు చేసినట్లు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మెనేజర్ పవన్, అసిస్టెంట్ మేనేజర్ బాబు తెలిపారు. నాలుగు పుణ్యక్షేత్రాలు, ఒక పర్యాటక ప్రదేశంతో పాటు ప్రయాణికులు కోరుకున్నట్లయితే కొండపోచమ్మ, రంగనాయకసాగర్ వంటి పర్యాటక ప్రదేశాలకు బస్సు వెళ్లనున్నట్లు చెప్పారు. అందుకు అదనంగా చార్జీలు వసూలు చేయనున్నట్లు చెప్పారు. అయితే ప్రయాణికుల సంఖ్యను బట్టి ఈ ప్రత్యేక బస్సును నడపనున్నట్లు తెలిపారు.



బోనం.. ఘనం

తొగుట మండలం వెంకట్రావ్‌పేట గ్రామంలో శుక్రవారం గడి మైసమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆలయం నుంచి బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నవితరణ కార్యక్రమం చేపట్టారు.

- తొగుట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి)



లారీ.. భారీ..

భారీ బాయిలర్ ప్లాంట్‌ను తీసుకెళ్తున్న 90 టైర్ల మూడు లారీలు శుక్రవారం హుస్నాబాద్‌లోని హన్మకొండ రోడ్డులో ఆగడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ ప్లాంట్లను హైదరాబాద్ నుంచి హన్మకొండ, ఎల్కతుర్తి, హుస్నాబాద్, సిద్దిపేట, రామాయంపేట మీదుగా ఆదిలాబాద్‌లోని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి తీసుకెళ్తున్నట్లు డ్రైవర్లు చెప్పారు. బ్రిడ్జీలు లేని రోడ్డు నుంచి వీటిని తీసుకెళ్తున్నామని, మంత్రుల పర్యటన ఉండటంతో మూడు గంటలు ఆపినట్లు వారు పేర్కొన్నారు.

- హుస్నాబాద్, జూన్ 27, (ఆంధ్రజ్యోతి)

అభివృద్ధికి అండగా..

- హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములమవుతాం
- మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి, దామోదర రాజనర్సింహ హామీ
- వరాలు కురిపించిన మంత్రులు..
- ఇక హుస్నాబాద్‌లో 50 సీట్ల మెడికల్ పీజీ కళాశాల
- రూ. 80 కోట్లతో సుందరగిరి- కొత్తపల్లి ఫోర్‌లేన్ రహదారి
- గిడ్డంగుల ఏర్పాటు
- ఈ సంవత్సరంలో గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తికి హామీ
- మంత్రి పొన్నంపై ప్రశంసల జల్లు
- బహిరంగ సభకు వచ్చిన అశేష జనం



150 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు నాగేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డి, రాజనర్సింహ, ప్రభాకర్, కలెక్టర్

హుస్నాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ సమగ్ర అభివృద్ధిలో భాగస్వాములవుతామని, మీరు కలలు కన్న హుస్నాబాద్ అభివృద్ధికి అండగా ఉంటామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. శుక్రవారం వారు రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలసి హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా హుస్నాబాద్‌పై వరాల జల్లు కురిపించారు. ఎవరు ఊహించని విధంగా హుస్నాబాద్‌కు 50 సీట్ల మెడికల్ పీజీ కళాశాల మంజూరు చేస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. హుస్నాబాద్ నుంచి సుందరగిరి నాలుగు వరుసల రహదారికి ప్రస్తుతం శంకుస్థాపన చేసుకున్నామని, సుందరగిరి నుంచి కొత్తపల్లి రాజీవ్ రహదారి వరకు ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణానికి రూ. 80 కోట్లు

మిగతా 8వ పేజీలో..



హుస్నాబాద్‌లో నిర్వహించిన సభకు హాజరైన జనం

పొన్నం ప్రభాకర్ ఆర్డర్ వేస్తే పనులు చేసి పెట్టడమే..

ఎమ్మెల్యే, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి, వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ ప్రశంసల జల్లులు కురిపించారు. పనుల కోసం ఆయన అడగడం కాదు.. ఆర్డర్ వేస్తే చెప్పిన పని చేసి పెట్టడమేనన్నారు. ఇంకా మూడున్నరేళ్లలో మీ సమస్యలన్నీ తీర్చే వ్యక్తి పొన్నం అని పేర్కొన్నారు. తెలంగాణ హక్కును పార్లమెంట్‌లో యావత్ దేశానికి వినిపించిన వ్యక్తి ప్రభాకర్ అని, 16 నెలల కాలంలో హుస్నాబాద్ అభివృద్ధిని చూస్తే ఏ ఒక్క శాఖను వదలలేదనేది తెలుస్తుందన్నారు. "నా హుస్నాబాద్, నా హుస్నాబాద్ అంటూ" అభివృద్ధిలో ముందిగా ఉంటారని, నిత్యం. అభివృద్ధి కోసం పరితపిస్తుంటారని తెలిపారు. ఇలాంటి నాయకుడు ఈ నియోజకవర్గానికి ఉండటం మీరు అదృష్టవంతులన్నారు. వచ్చే ఎన్నికల్లో లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఎస్ఎస్‌సీ సప్లమెంటరీ ఫలితాల్లో

95.90 శాతం ఉత్తీర్ణత

సిద్దిపేట కల్చరల్, జూన్27 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌సీ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ ఫలితాల్లో జిల్లాలో 95.90 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జూన్ 3 నుంచి 13 వరకు జరిగిన పరీక్షల్లో జిల్లా నుంచి 682 మంది బాలురు, 464 మంది బాలికలు మొత్తం 1146 మంది హాజరయ్యారు. ఇందులో 648 మంది బాలురు 95.01 శాతం, 451 మంది బాలికలు 97.20 శాతం, మొత్తంగా 1099 మంది 95.90 శాతం ఉత్తీర్ణత నమోదైందని పేర్కొన్నారు.

మెడికల్ దుకాణాల్లో

ఇష్టారాజ్యం

- విచ్చలవిడిగా ఏర్పాటు
- ఫార్మాసిస్టు లేకుండానే అమ్మకాలు
- డాక్టర్ ప్రిస్కిప్షన్ ఇవ్వకున్నా విక్రయాలు
- నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నా తనిఖీలేవి?

7

చినుకు పడితే మల్లన్న గుడి

జలమయమే

- శిథిలావస్థకు చేరిన రేకులకుంట ఆలయం
- కూలిన గోడలు, బీటలు వారిన గోపురాలు
- ఆదాయం ఉన్నా అభివృద్ధి శూన్యం

7

హిమాన్ష్ ఏజెన్సీ కథ కంచికేనా!

- మళ్లీ మొదటికొచ్చిన కొమురవెల్లి మల్లన్న ఆలయ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వ్యథ
- నూతన ఏజెన్సీకి కమిషనర్ అనుమతిలో జాప్యం
- మూడు నెలలుగా అందని వేతనాలు



ఆలయంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

చేర్యాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయానికి కొన్నాళ్ల క్రితం వరకు మ్యాన్‌పవర్ సరఫరా చేసి లక్షలాది రూపాయల జీఎస్టీతో పాటు సిబ్బంది ఈపీఎఫ్, ఈఎస్ఐ డబ్బు ఎగొట్టిన హిమాన్ష్ సీఆర్ఎం సర్వీసెస్ ఏజెన్సీ కథ కంచికి చేరినట్టేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయాధికారులు, పోలీసుల మధ్య సమన్వయలోపంతో సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడం కలకలం రేపుతుంది. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు అందించేందుకు నూతన ఏజెన్సీని ఖరారు చేయకపోవడంతో వేతనాల వ్యథ మళ్లీ మొదటికొచ్చింది. మూడు నెలలుగా వేతనాలు నిలిచిపోవడంతో 30మంది సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

రూ.28 లక్షల మేర స్వాహా చేసినా..

మల్లన్న ఆలయంలో మ్యాన్ పవర్ సరఫరా నిమిత్తం హైదరాబాదుకు చెందిన హిమాన్ష్ సీఆర్ఎం సర్వీసెస్‌తో సెప్టెంబరు-2023నుంచి ఆగస్టు-2025 వరకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న 30 మంది సిబ్బందికి ప్రతినెలా వేతనాల డబ్బులు హిమాన్ష్ సర్వీసెస్‌కు చెల్లించింది. అందుకు ఏజెన్సీ నిర్వాహకులు కేంద్రప్రభుత్వానికి ప్రతీ నెలా 18 శాతం జీఎస్టీతోపాటు 30 మంది సిబ్బంది పేరిట 13 శాతం ఈపీఎఫ్, 3.25 శాతం చొప్పున ఈఎస్ఐ చెల్లించాలి. ఒక్కనెలా డబ్బు చెల్లించకపోయినా ఏజెన్సీ నిర్వాహకుడికి చెల్లింపులు నిలుపుదల చేయాల్సినప్పటికీ ఆలయాధికారులు లోపాయికారి ఒప్పందంతో నిమ్మకుండిపోయారు. అప్పటి నుంచి ఈపీఎఫ్ రూ.11,88,800, ఈఎస్ఐ రూ.2,96,564, జీఎస్టీ రూ.14.11లక్షలు చెల్లించకపోయినా ఏజెన్సీకి నెలవారీ చెల్లింపులు చేపట్టారు. రూ.28 లక్షల మేర పక్కదోవ పట్టించి 30 మంది సిబ్బంది 20 నెలల ప్రయోజనాలను కాలరాసినా, కేంద్రానికి జీఎస్టీ ఎగ్గొట్టినప్పటికీ ఏజెన్సీ నిర్వాహకుడితో బం.దం కొనసాగించడంపై కమీషన్ల కక్కుర్తికి పాల్పడ్డారన్న అనుమానాలకు బలం చేకూర్చుతున్నాయి.

గత మార్చిలో ఏజెన్సీపై సిబ్బంది ఫిర్యాదు చేశారు. ఆంధ్రజ్యోతి కూడా ఈ విషయంపై పలు కథనాలు ప్రచురించడంతో హిమాన్ష్ ఏజెన్సీపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత నిబంధనలకు విరుద్ధంగా ఏజెన్సీకి డబ్బు చెల్లించిన సమయంలో పనిచేసిన అధికారులు, సంబంధిత విభాగ సిబ్బంది ఇరుక్కోవాల్సి వస్తుందన్న కారణంగా ఉద్దేశ్యపూర్వకంగా పోలీసులకు సమాచారం ఇవ్వకుండా దాటవేస్తున్నారు. ఒకరిద్దరిని కాపాడేందుకు ముప్పైమంది సిబ్బంది ప్రయోజనాలను తాకట్టుపెట్టడం వివాదాస్పదంగా మారుతుంది.

మళ్లీ మూడు నెలలుగా వేతనాలు అందక

హిమాన్ష్ ఏజెన్సీ అవినీతి వ్యవహారం కారణంగా కలెక్టర్ మరో ఏజెన్సీని అనుమతించారు. దేవాదాయశాఖ కమిషనర్ అనుమతికి ప్రతిపాదించారు. కానీ ఇప్పటికీ ఖరారు చేయకపోవడంతో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి నేరుగా అందించడం విరుద్ధమన్న కారణంగా మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. కమీషనర్ అనుమతి పొందేంత వరకు ఎదురుచూపులు తప్పవా అని ఉసూరుమంటున్నారు.

సిద్దిపేట సీపీ చొరవ వహిస్తేనేనా!

కొన్నాళ్లక్రితం ఆడిటర్ ధనుంజయ జీఎస్టీ, ఐటీ డబ్బు పక్కదోవ పట్టించిన విషయమై ఆలయవర్గాలు సిద్దిపేట సీపీ దృష్టికి తీసుకువెళ్లడంతో ప్రత్యేక చొరవ వహించి రోజుల వ్యవధిలోనే రికవరీకి మార్గం సుగమం చేశారు. రూ.28లక్షల మేర దిగమింగిన హిమాన్ష్ ఏజెన్సీ విషయంలో నెలల తరబడి తాత్సారం జరుగుతున్న క్రమంలో మరోమారు సీపీ చొరవ వహిస్తే రికవరీ అవుతాయేమోనని స్థానికులు ఆశిస్తున్నారు.

అనుమతి రాగానే చెల్లింపు : ఈవో అన్నపూర్ణ

హిమాన్ష్ ఏజెన్సీ వ్యవహారంలో చోటుచేసుకున్న మాదిరిగా పొరపాట్లకు తావివ్వకుండా ఔట్ సోర్సింగ్ సిబ్బందికి నేరుగా వేతనాలు చెల్లించలేకపోతున్నాం. కలెక్టర్ అనుమతించిన మరో ఏజెన్సీని దేవాదాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదించాం. అనుమతి రాగానే సిబ్బందికి వేతనాలు చెల్లిస్తాం. హిమాన్ష్ ఏజెన్సీ పక్కదోవ పట్టించిన డబ్బు రికవరీకి చర్యలు వేగవంతం చేస్తాం.

మల్లన్న ఆలయంలో వేలంపాట

చేర్యాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో పలు అంశాలకు సంబంధించి శుక్రవారం ఈవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. మల్లన్న ఆలయ ఆవరణలో కొబ్బరికాయల విక్రయహక్కును డి.విష్ణు మూర్తి రూ.45,50,116కు హెచ్చు పాటపాడి దక్కించుకున్నాడు. ప్రసాద తయారీ లేబర్ చార్జీ చెల్లింపునకు సంబంధించి ఎస్.కనక మల్లేశం రూ.29.90కు టెండర్ దక్కించుకున్నప్పటికీ నెగోషియేషన్ ద్వారా రూ.28.90కు ఖరారు చేశారు. రాతిగీరల పక్కన ఉన్న షాప్ నెం-3, షాప్ నెం-20 నెలకు రూ.8,200 చొప్పున లీజుకు ఇచ్చారు. మొక్కుబడి టికెట్లు, ఇతర బుక్ ప్రింటింగ్‌ను ముల్కనూరు లక్ష్మి ఆఫ్‌సెట్ ప్రింటర్స్ దక్కించుకున్నారు. పూలు, పూలదండలు సరఫరాకు, ఎల్లమ్మ ఆలయం వద్ద కూల్‌డ్రింక్స్ విక్రయానికి ఒక్కో షెడ్యూల్ దాఖలు చేయడం, ఆలయ నిత్యాన్నదానసత్రం సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలకు షెడ్యూల్స్ దాఖలు కాకపోవడంతో వాయిదా వేశారు. త్వరలో వాటికి నోటిఫై ద్వారా టెండర్లు చేపడతామని ఈవో అన్నపూర్ణ తెలిపారు.

580 క్వింటాళ్ల రేషన్ పట్టివేత

- నకిలీ ఎస్ఈకే నంబర్లతో గజ్వేల్ గోడౌన్‌కు అప్పగించే యత్నం
- పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

గజ్వేల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి):గజ్వేల్‌లో సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి 580 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం తుర్కపల్లికి చెందిన శ్రీ హనుమాన్ రైస్ మిల్లు యజమాని సీఎంఆర్ కింద బియ్యాన్ని గజ్వేల్ గోడౌన్‌కు సరఫరా చేస్తున్నారని, తన మిల్లు నుంచి కాకుండా వేరే చోట నుంచి బియ్యాన్ని అందిస్తున్నట్లు నమ్మదగిన సమాచారంతో దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ రేంజ్ టాస్క్‌ఫోర్స్ ఏఎస్పీ వెంకటేశ్వర్లు, ఓఎస్డీ ప్రభాకర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి, తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హనుమాన్ రైస్‌మిల్లు నుంచి రావాల్సిన ట్రక్ షీట్లు, బియ్యం సంచుల ఎస్ఈకే నంబర్లతో పోల్చి చూసినప్పుడు తప్పుగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. మొత్తం మూడు లారీలు రాగా, ఒక లారీ ట్రక్ షీట్, సీఎస్‌కే నంబర్లు సరిగా ఉన్నాయని చెప్పారు. రెండు లారీల బియ్యం అక్రమంగా రవాణా చేసినట్లు గుర్తించామని, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తించామని తెలిపారు. కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. వారితో టాస్క్‌ఫోర్స్ సీఐ పండరి, ఎస్ఐలు జంగయ్య, వెంకటేశ్వర్లు, సాంబశివరావు, స్పెషల్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, స్థానిక సివిల్ సప్లయ్ డీటీ సాయి రవి ఉన్నారు.

ఇర్కోడ్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేయాలి

- లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం : జలసాధన సమితి బృందం

తొగుట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇర్కోడ్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వెంటనే పూర్తి చేయాలని లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని జలసాధన సమితి బృందం సభ్యులు అధికారులను హెచ్చరించారు. శుక్రవారం ఇంజనీరింగ్ అధికారులతో రైతులు సమావేశమయ్యారు. 12 గ్రామాలకు సంబంధించి ఇరిగేషన్ ఇంజనీర్లు అన్ని గ్రామాల్లో పనిచేయడానికి కావలసిన యంత్రాలను వర్కర్లను తీసుకువచ్చి పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు చెప్పామని అధికారులు రైతులకు వివరించారు. పలు దఫాలుగా కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చినా పనులు ప్రారంభించడం లేదన్నారు. పెండింగ్ పనులు పూర్తిచేయడానికి తాము సంసిద్ధంగా ఉన్నామని కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని వారు రైతుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై అధికారులు మెదక్ ఎంపీ రఘునందర్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డికి టెలికాన్ఫరెన్స్ ద్వారా సమాచారమందించారు. నెలరోజుల్లో పనులు పూర్తిచేయాలని ఎంపీ, ఎమ్మెల్యే ఆదేశించారు. కానీ మెగా కంపెనీ కాంట్రాక్టర్ కృష్ణారెడ్డి ఆదేశాలు వస్తేనే పనులు ప్రారంభమవుతాయని అధికారులు తెల్పిచెప్పారు. పనులు ప్రారంభించకపోతే ఆందోళనలకు దిగుతామని జలసాధన సమితి సభ్యులు హెచ్చరించారు.



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న జలసాధన సమితి బృందం

రామాయంపేటలో యంగ్ ఇండియా విద్యాలయం

● మొదటి విడతలోనే నిర్మాణానికి చర్యలు
● టీజీఈడబ్ల్యూఐడీసీ భూ-సర్వే పూర్తి


యంగ్ ఇండియా, ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ నమూనా

రామాయంపేట,జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నేలా యంగ్ ఇండియా, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ రూపుదిద్దుకోబోతుంది. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలే లక్ష్యంగా రాష్ట్రంలోని 59 కాంప్లెక్స్‌ల్లో భాగంగా మొదటి విడతలో మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో దీన్ని నిర్మించ తలపెట్టారు. ఇందుకోసం 22ఎకరాల విస్తీర్ణంలో రూ.210 కోట్లు వెచ్చించేందుకు రంగం సిద్ధమైంది.ఈ మేరకు పక్షం రోజుల కిందట టీజీఈడబ్ల్యూఐడీసీ రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ గణపతిరెడ్డి, జిల్లా ఇంజనీరింగ్ విభాగం అధికారులు భూ సర్వే చేపట్టారు. స్థానిక బైపాస్, డబుల్ ఇళ్లు ఆనుకొని 1421 సర్వే నెంబర్‌లో స్థలాన్ని అనువైనదిగా మ్యాప్ ఆధారంగా ధ్రువీకరించారు. దీంతో ఇక టెండర్ల ప్రక్రియకు అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. అన్ని హంగులతో ఇక్కడ అధునాతన భవనం ఏర్పాటై.. 2500 మంది ఐదు నుంచి ఇంటర్ విద్యార్థులకు ఆశ్రయం ఇవ్వనుంది. ఇది పూర్తయ్యాక విద్యార్థులకు నీట్, ఐఐటి లాంటి అధునాతన శిక్షణలు ఇస్తారు. అత్యంత ఉన్నత నాణ్యత గల డిజిటల్ ఎడ్యుకేషన్ ఉంటుంది. అలాగే టీచింగ్ స్టాఫ్ కోసం క్వార్టర్స్ ఏర్పాటు చేస్తారు. మొట్టమొదటి సారిగా రామాయంపేటలో ఇంతటి ప్రాధాన్యత గల కాంప్లెక్స్ ఏర్పాటవటం ఈ ప్రాంత అభివృద్ధికి సోపానంగా మార్చుకునేందుకు అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బంగారం దాస్తామని.. పుస్తెలతాడు అపహరణ

హుస్నాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అక్కన్నపేట రోడ్డులో శుక్రవారం ఓ వృద్ధురాలిని నమ్మించి ఆమె మెడలోని రెండున్నర తులాల పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామానికి చెందిన పిట్టల లచ్చవ్వ అనే వృద్ధురాలు పని నిమిత్తం హుస్నాబాద్‌కు వచ్చింది. పని ముగించుకొని నడుచుకుంటూ పట్టణంలోని అక్కన్నపేట రోడ్డులో ఉన్న బంధువుల ఇంటికి వెళ్తుండగా ఇరువురు వ్యక్తులు ఆమెకు అడ్డుగా వచ్చి, ఏందమ్మా మెడలో అంత బంగారం వేసుకొని వెళ్తున్నావు. దొంగలు వచ్చి ఎత్తుక పోతారు. మా సారు రమ్మంటండని చెప్పి పక్క గల్లీలోకి తీసుకెళ్ళారు. ఆ పుస్తెల తాడు ఇవ్వు. ప్యాక్ చేసి ఇస్తామని నమ్మబలికి ఆమె వాటిని ఇవ్వగా ప్యాక్ చేసిన కవర్‌ను చేతులో పెట్టి జాగ్రత్తగా వెళ్లమని పంపించారు. కొంత దూరం వెళ్లి కవర్‌ను చూడగా అందులో ఇసుక ఉండటంతో లబోదిబోమని మొత్తుకుంది. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్ళగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



అమ్మో.. దొంగలు

●నర్సాపూర్‌లో వరుస ఘటనలు



సీసీ కెమరాలో చిక్కిన చోరీకి పాల్పడుతున్న వ్యక్తి

నర్సాపూర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలో వరుస చోరీలు జరుగుతుండటం స్థానిక పోలీసులకు పెను సవాల్‌గా మారింది. నియోజకవర్గ కేంద్రంతో పాటు డివిజన్ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలో సుమారు 25వేల జనాభా ఉంటుంది. పట్టణం రోజురోజుకూ విస్తరిస్తుండటంతో పాటు వ్యాపార పరంగా కూడా అభివృద్ధి చెందుతుండటంతో ఇక్కడకు ఎవరు వస్తున్నారో ఎవరు వెళ్తున్నారో కూడా తెలియని పరిస్థితి . ఇదే అదునుగా వరుస చోరీలకు పాల్పడుతూ స్థానిక ప్రజలలో ఆందోళనకు కారణమవుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్‌తో పాటు నిఘా కూడా పెట్టి దొంగతనాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా చోరీలు ఆగకపోగా దొంగల ఆచూకీ కూడా పట్టుకోలేకపోతున్నారు. ఈ జూన్ మాసంలోనే పట్టణంలో ఐదు చోట్ల చోరీలు జరిగాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తెలుసుకోవచ్చు. జూన్ 1న నర్సాపూర్ సమీకృతమార్కెట్ వద్ద పార్క్ చేసిన ట్రాక్టర్ ఇంజన్ చోరీకి గురికాగా, జూన్ 2న ఆర్టీసీ బస్సులో నర్సాపూర్ నుంచి బోయినపల్లి వెళ్తున్న ఓ మహిళ బ్యాగులో ఉన్న ఐదు తులాల బంగారు నగలు అపహరణకు గురయ్యాయి. జూన్ 20న పోలీస్‌స్టేషన్‌కు అతీసమీపంలో ఉండే నల్లపోచమ్మ ఆలయంలో చొరబడి అమ్మవారి ముక్కుపుడక అపహరించారు. ఈ నాల్గు రోజులలో అయితే ఓ స్టీలు హార్డ్‌వేర్, మెడికల్ హాల్‌తో పాటు క్లినిక్‌లో చొరబడి అందులో ఉన్న నగదు ఎత్తుకెల్లారు. వీటితో పాటు పట్టణంలో రోడ్డుపై, ఇళ్ల ముందు పార్కు చేసిన ద్విచక్రవాహనాల అపహరణ అయితే అంతేలేకుండా పోయింది. చివరకు మూడురోజుల క్రితం ఏకంగా ఆటో కూడా ఎత్తుకెళ్లిన ఘటన ఉండటం విశేషం. పట్టణంలోనే పోలీసులు అందుబాటులో ఉండే చోటనే చోరీలు జరుగుతుండటంతో పట్టణ వాసులు ఆందోళనకు గురవుతుంటే ఇక గ్రామాలలో పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఎదురవుతుంది. సీసీ కెమరాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసినా కూడా చోరీలకు పాల్పడే వారు వాటి నుండి తప్పించుకోవడానికి ముఖాలకు ముసుగు ధరించి మరీ చోరీలకు పాల్పడుతూ వారిని గుర్తు పట్టకుండా జాగ్రతలు తీసుకుంటుండటంతో పోలీసులకు కూడా దొంగలను గుర్తించడానికి పెద్ద కష్టంగా మారింది. తాజాగా ఎస్‌బీఐ బ్రాంచిలో కూడా మేనేజర్ గదికి చెందిన కిటికీ అద్దాలు పగులగొట్టి అందులో దూరడానికి యత్నించి విఫలమైన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకున్నట్లు బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విధంగా వరుస చోరీలతో పట్టణ వాసులను ఆందోళనకు గురిచేస్తున్న వారి ఆగడాలను కట్టడి చేసి వారిని పట్టుకుని తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





భవనంపై నుంచి పడి బాలుడి మృతి

పటాన్‌చెరు రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : భవనంపై నుంచి పడి బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన బీడీఎల్‌లో జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కి చెందిన రూప్ చంద్ భార్య సత్యశీల, ముగ్గురు పిల్లలతో కలిసి వెలమెల సమీపంలోని అభినందన కనస్ట్రక్షన్‌లో మేస్త్రీ పని చేసుకుంటూ అక్కడే క్యాంపులో ఉంటున్నాడు. సోమవారం నిర్మాణ దశలో ఉన్న భవనం వద్దకు వచ్చిన చిన్న కుమారుడైన లవ్ (3)ను తీసుకొని వెళ్లాడు. మూడో అంతస్తులో భార్యా భర్తలు పని చేస్తుండగా లవ్ ఆడుకుంటూ మూడో అంతస్తుపై నుంచి కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలైన బాలుడిని చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి తండ్రి రూప్‌చంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

జహీరాబాద్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మాడ్గి శివారులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన గురువారం అర్థరాత్రి కర్ణాటక-తెలంగాణ సరిహద్దు వద్ద 65వ జాతీయరహదారిపై మొగుడంపల్లి మండలంలోని మాడ్గి శివారులో జరిగింది. చిరాగ్‌పల్లి ఎస్సై రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో సుమారు 40 సంవత్సరాల వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అన్నారు. మృతదేహానికి సంబంధించిన వారెవరైనా ఉంటే చిరాగ్‌పల్లి పోలీసులను సంప్రదించాలని ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

మనోహరాబాద్ జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నీరు తాగేందుకు వెళ్లి విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటన గురువారం మండల పరిధి ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్థులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో అటవి ప్రాంతం పక్కన బోరు కలదు. ఈ బోరు గుండానే గ్రామానికి మంచి నీరు సరఫరా అవుతుంది. పశువులు బోరు మోటర్ చుట్టు పక్కల మేత మేస్తూ బోరు వద్ద నీటిని తాగుతాయి. రోజూలాగే శుక్రవారం సాయత్రం బోరు మోటర్ వద్ద గుంతలో నీటీని తాగడానికి వెళ్లిన గేదె విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. బాధితులు ఘటనా స్థలాన్ని పరిశీలించగా బోరు మోటర్ షాక్ వస్తుందని అన్నారు. మహేష్ అనే రైతు నెల క్రితం రూ.1 లక్ష 20 వేల రూపాయాలు పెట్టి ఈ గేదెను కొనుగోలు చేశానని అన్నాడు. రైతు గేదె మృతి చెందడంతో కన్నీటి పర్యావంతంగా గోస చెప్పుకున్నాడు. విద్యుత్ అధికారులు స్పందించి రైతుకి న్యాయం చేయాలని గ్రామస్థులు వేడుకున్నారు. బోరు మోటర్ గ్రామ శివారులో ఉండటంతో అనేక సార్లు దొంగలు కేబుల్ కట్ చేస్తున్నారని కార్యదర్శి అన్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన వృక్షం


రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షం

వర్గల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మైలారం వద్ద శుక్రవారం సాయంత్రం విపరీతమైన ఈదురు గాలులతో మైలారం నుంచి నెంటూర్ వెళ్లే రహదారిపై రోడ్డు పక్కనే ఉన్న వృక్షం నేలకొరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో మైలారం నుంచి నెంటూర్ వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్థులు వృక్షాన్ని పక్కకు తీసేందుకు శత విధాల ప్రయత్నం చేసి చివరకు దానిని రోడ్డు పక్కకు తోసేయడంతో వాహనాల రాకపోకలు యదావిధిగా కొనసాగాయి. రోడ్డుకు అడ్డంగా పడిపోయిన వృక్షాన్ని తీయడానికి దాదాపు గంట సమయం పట్టిందని స్థానికులు చెప్పారు.

సెంట్రింగ్ డబ్బాల దొంగల ముఠా అరెస్ట్

అమీన్‌పూర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్‌లోని ఓ నిర్మాణ సంస్థ నుంచి సెంట్రింగ్ డబ్బాలు దొంగిలించి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపిన వివారల ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీలో అదిత్రీ నిర్మాణ సంస్థకు చెందిన ప్రాజెక్టు వద్ద సెంట్రింగ్ డబ్బాలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తుండగా శుక్రవారం ఓ బొలేరో వాహనంలో అనుమానాస్పదంగా తరలిస్తున్న సెంట్రింగ్ డబ్బాలను పోలీసులు పట్టుకున్నారు. వాహనంలో ప్రయాణిస్తున్న కోహీర్ మండలం కవేలీ గ్రామానికి చెందిన చాపలఅంజలి, గోసనినందిని, సదాశివపేట సిద్ధాపూర్ కాలనీకి చెందిన చాపలసుశీల శాంతమ్మ, చాపలఅనిత, వాహనం డ్రైవర్ అనంతపూర్‌కు చెందిన ప్రసాద్‌లను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా దొంగతనం చేసినట్లు అంగీకరించారు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసి బొలేరో వాహనాన్ని, అందులోని 30 సెంట్రింగ్ డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు.

బైక్ దొంగల అరెస్టు

జిన్నారం, జూన్ 27, (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాలలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం గడ్డపోతారం మున్సిపాలిటీ కిష్టయ్యపల్లి చౌరస్తా వద్ద ఎస్సై కిష్టారెడ్డి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఓ ఆటోలు ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు వాహనం ఆపకుండా పారిపోవటానికి ప్రయత్నించారు. ఎస్సై కిష్టారెడ్డి సిబ్బంది వారిని అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌ల చోరీలకు పాల్పడ్డారని సీఐ రవీందర్‌రెడ్డి తెలిపారు. నిందితులు షేక్ ఫక్రోద్దీన్, జగన్‌లు మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం అంతారం గ్రామానికి చెందిన వారు. మరో నిందితుడు రాకేష్ రంగారెడ్డి మేడ్చల్ జిల్లా దుండిగల్‌కు చెందిన వాడు. కొంత కాలంగా వీరు ముగ్గురు కలిసి దుండిగల్, నర్సాపూర్, గడ్డపోతరం పరిధిలో 9 ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు గుర్తించి వీరు ముగ్గరితో పాటు వీరికి సహకరించిన ఆటో డ్రైవర్ జగన్‌ను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

ఎల్ఈడీ పార్క్‌కు మట్టి అక్రమ రవాణ

జిన్నారం, జూన్, 27 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం రాళ్లకత్వ శివారు నుంచి ఎల్ఈడీ పరిశ్రమల ప్రాంతానికి మట్టి అక్రమ రవాణ జోరుగా జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. రాళ్లకత్వ గ్రామ సమీపంలో నుంచి కొన్ని రోజులుగా రాత్రి వేళ ఎల్ఈడీ పార్క్ పరిశ్రమల ఏర్పాటు పనుల కోసం భారీగా మట్టిని తరలిస్తున్నారని, భారీ వాహనాలతో రహదారులు గుంతల మయం కాగా సహజ సంపదను అక్రమార్కులు దోచుకుంటున్నారని స్థానికులు తెలిపారు.

సీపీఐని తిరిగి బలోపేతం చేయాలి


జిల్లా సీపీఐ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు నర్సింహా

నర్సాపూర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో సీపీఐ గతంలో ఎన్నో పోరాటాలు చేసి పేదలకు పెద్ద మొత్తంలో భూపంపిణీ చేసి జిల్లాలో ప్రత్యేక స్థానంలో ఉండేదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నర్సింహా పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లోని సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కాలేక్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నర్సింహా మాట్లాడుతూ జిల్లాలో సీపీఐని తిరిగి బలోపేతం చేసి పేదల పక్షాన పోరాడుతూ వారికి అండగా ఉండేలా ప్రతి కార్యకర్త కష్టపడాలన్నారు.

మెడికల్ దుకాణాల్లో ఇష్టారాజ్యం

విచ్చలవిడిగా షాపుల ఏర్పాటు

ఫార్మాసిస్టు లేకుండానే...

డాక్టర్ ప్రిస్కిప్షన్ ఇవ్వకున్నా విక్రయాలు

నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నా తనిఖీలేవి?



గజ్వేల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఔషధ నియంత్రణ సంస్థ నిబంధనలను బేఖాతర్ చేస్తూ మెడికల్ దుకాణాలు ఇష్టానుసారంగా నడుస్తున్నాయి. సిద్దిపేట జిల్లాలో సుమారు 800పైగా ఫార్మసీలు ఉండగా, వాటిలో చాలావరకు నియమాలను తుంగలో తొక్కుతూ కొనసాగుతున్నవే.

ఉల్లం'ఘనులు'

మెడికల్ దుకాణాలు నిర్వహించాలంటే తప్పనిసరిగా ఫార్మాసిస్ట్ ఉండాలి. కానీ, దాదాపుగా మెడికల్ షాపు నిర్వాహకులు అందరూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నవారే. జిల్లా వ్యాప్తంగా ఫార్మసిస్టులు ఉన్న దుకాణాలు 20కి మించి లేవంటే అతిశయోక్తి కాదేమో. కొన్ని దుకాణాల్లో రెండు, మూడేళ్ల పాటు పనిచేసి స్వయంగా మెడికల్ షాపును పెట్టుకొని అద్దెకు బీ-ఫార్మసీ, డీ-ఫార్మసీ సర్టిఫికెట్ తెచ్చుకొని యథేచ్ఛగా నడిపిస్తున్నారు. ఈ ఫార్మాసిస్టుల సర్టిఫికెట్‌కు కొందరు నెలవారీగా, మరికొందరు సంవత్సరానికి ఒకసారి డబ్బులు చెల్లిస్తూ వ్యాపారం చేస్తున్నారు. ఇటా మందుల గురించి సరైన అవగాహన లేని వ్యక్తులే వాటిని అమ్ముతున్నారు. అంతేనా ఇంటర్, డిగ్రీ కూడా పూర్తి చేయని వారిని షాపుల్లో పనికి కుదుర్చుకుని వారి ద్వారా మందులను ఇప్పిస్తున్నారు. దీంతో రోగులకు తప్పుడు మందులు వెళ్లే ప్రమాదాన్ని పెంచుతోంది.

ప్రిస్కిప్షన్ లేకుండానే విక్రయాలు

వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా మందులు అమ్మకూడదన్న నిబంధనను మెడికల్ షాపులు అస్సలు పట్టించుకోవడం లేదు. అడిగిన వారందరికీ ఏ మందులంటే అవి ఇచ్చేస్తున్నారు. ముఖ్యంగా షెడ్యూల్-హెచ్ డ్రగ్స్‌ను కూడా డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండానే విక్రయిస్తున్నారు. ఇది చాలా ప్రమాదకరం. మందులు కొన్న తర్వాత బిల్లులు ఇవ్వడం లేదు.

మెడికల్ షాపుల్లోనే క్లినిక్‌లు

కొన్ని మెడికల్ షాపుల్లోనే డాక్టర్లను ఉదయం, సాయంత్రం వేళల్లో కూర్చోబెట్టి క్లినిక్‌లు నడుపుతున్నారు. అంతేకాదు షాపులకు అనుబంధంగా కొన్ని చోట్ల చిన్నపాటి డయాగ్నస్టిక్ సెంటర్లనే నడిపిస్తున్నారు. అర్హత లేని వారితో టెస్టులు చేయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ వ్యవహారంపై వైద్యారోగ్య శాఖ, ఔషధ నియంత్రణ అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలేవి?

మందుల దుకాణాలపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు నిరంతరం పర్యవేక్షణ చేయాలి. లైసెన్సులు, ఫార్మాసిస్టులు ఉన్నారా లేదా, రికార్డులు సరిగా ఉన్నాయా అని తనిఖీ చేయాలి. కానీ సిద్దిపేట జిల్లాలో అధికారులు ఈ తనిఖీలను నామమాత్రంగానే చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ నిర్లక్ష్యం వల్లే ఎవరుపడితే వారు యథేచ్ఛగా మందులు అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నూతన విద్యా విధానం అమలు చేయాలి

- ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి
- పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయండి
- తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ డిమాండ్



మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్

మెదక్ అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని తక్షణమే అమలు చేయాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ డిమాండ్ చేశారు. మెదక్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా కార్యనిర్వాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని సురేష్ కోరారు. జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి విధానాన్ని తిరిగి అమలు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల హెల్త్‌కార్డులు కార్పొరేట్ ఆసుపత్రులలో కూడా వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శి బాస్కర్, రాష్ట్ర బాధ్యులు రామారావు, మహిళ అధ్యక్షురాలు స్వరూపరాణి, స్వప్న, మాధవ్‌రెడ్డి, జిల్లా బాధ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీలకు ప్రత్యేక వ్యవస్థ అవసరం

- డీఈవో, ఎంఈవోలతోనే తనిఖీలు జరగాలి
- పెండింగ్ బిల్లులు, డీఏలు చెల్లించాలి
- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి



మాట్లాడుతున్న టీఎస్‌యూటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి

నారాయణఖేడ్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల తనిఖీ కోసం ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి అన్నారు. శనివారం నారాయణఖేడ్‌లో నిర్వహించిన సంఘం డివిజన్ స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులను పర్యవేక్షణకు వినియోగించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పర్యవేక్షణ బాధ్యతలకు డీఈవో, డిప్యూటీ ఈవో, ఎంఈవో, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను వినియోగించుకోవాలని ఆమె సూచించారు. అవసరమైన చోట్ల అదనపు పోస్టులను మంజూరు చేసి, ప్రత్యేక యంత్రాంగం ద్వారానే పర్యవేక్షణ చేపట్టాలని జ్ఞానమంజరి అన్నారు. ఉపాధ్యాయులను తనిఖీ అధికారులుగా నియమిస్తే కేడర్, సీనియారిటీ సమస్యలతో పాటు విద్యార్థులకు కూడా నష్టం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. అంతేకాకుండా, పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న బిల్లులు, డీఏలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డు అందుకున్న శశిధర్

చిన్నశంకరంపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శశిధర్ రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు ఎంపికయ్యారు. గతంలో హైదరాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహించి, అక్కడ ఉత్తమ ఫలితాలు సాధించినందుకుగానూ రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డుకు ఆయనను ఎంపిక చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లోని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగిత రానా, ఇంటర్మీడియట్ కమిషనర్ కృష్ణ ఆదిత్య చేతుల మీదుగా శశిధర్ ఈ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శశిధర్ మాట్లాడుతూ ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచిందని, జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ప్రిన్సిపాల్‌ను అధ్యాపక బృందం అభినందించింది.

చినుకు పడితే మల్లన్న గుడి జలమయమే

శిథిలావస్థకు చేరిన రేకులకుంట ఆలయం

కూలిన గోడలు, బీటలు వారిన గోపురాలు

ఆదాయం ఉన్నా.. అభివృద్ధి శూన్యం

భక్తులకు కనీస వసతులు లేక ఇబ్బందులు





రేకులకుంట మల్లన్న ఆలయం, గురువారం కురిసిన వర్షానికి కూలిన ఆలయ గోడ

దుబ్బాక, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక రేకుల కుంట మల్లికార్జున స్వామి, రేణుకా ఎల్లమ్మ ఆలయాలు దుర్భర స్థితిలో ఉన్నాయి. లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు. సరైన గోపురం, చుట్టూ గోడలు లేక, వర్షం పడితే ఆలయం మొత్తం నీటితో నిండిపోతోంది. నడి అటవీ ప్రాంతంలో ఉన్న ఈ ఆలయానికి వచ్చే భక్తులకు కనీస వసతులు కూడా లేకపోవడంతో వారానికోసారి జరిగే జాతరలో అవస్థలు తప్పడం లేదు.

నయాపైసా విదల్చని ప్రభుత్వం

దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయానికి ఏటా సుమారు రూ.50 లక్షల నుంచి 60 లక్షల వరకు ఆదాయం వస్తోంది. అంతేకాకుండా, ఆలయం పేరుతో ఎస్‌బీఐ, టీజీబీ బ్యాంకుల్లో రూ.1.40 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. 40 తులాల బంగారం, 15 కిలోల వెండి కూడా బ్యాంకు లాకర్‌లో భద్రంగా ఉన్నాయి. అయితే, ఇంతటి ఆదాయం ఉన్నప్పటికీ, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నయాపైసా రాకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.

భక్తులకు నిలువ నీడ కరువు

ఆలయం మల్లన్నగుట్టలు రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉండటంతో కనీస వసతులు కూడా లేవు. గతంలో దాతలచే నిర్మించిన సత్రాలు, గదులను అటవీ అధికారులు కూల్చివేయడంతో భక్తులకు నిలువ నీడ లేకుండా పోయింది. ఆలయ మండపం కేవలం పిల్లర్లతోనే ఉండటం, ఎల్లమ్మ, మల్లన్న ఆలయాల మధ్య చిన్న గోడ ఉండటంతో గుట్టల నుంచి వచ్చే వరద నీరు నేరుగా ఆలయంలోకి చేరుతోంది. ఎల్లమ్మ, మల్లన్న ఆలయాల గోడలు బీటలు వారాయి. ఆలయంపై స్లాబ్‌పైన నిర్మించిన గోపురం బరువుకు ఒక పిల్లర్ కిందికి జారడంతో ప్రమాదకరంగా మారింది. వర్షం పడితే జలమయంగా మారే ఆలయం పరిస్థితి భక్తుల్లో ఆందోళన కలిగిస్తోంది.

అనుమతుల కోసం ఎదురుచూపులు

ఈ ఆలయాన్ని పునరుద్ధరించాలంటే అటవీ శాఖ అనుమతులు తప్పనిసరి. ఆలయం చుట్టూ రెండు హెక్టార్ల అటవీ భూమిని కేటాయించాలని గతంలోనే ప్రతిపాదనలు పంపారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, గతంలో ఎంపీగా ఉన్న సమయంలో కేంద్ర అటవీ శాఖ మంత్రిని కలిసి విన్నవించారు. అరణ్య భవన్ నుంచి డిజిటల్ సర్వే చేయించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ద్వారా కూడా వినతులు అందాయి. అటవీ శాఖ అనుమతులు లభిస్తే, ఆలయాన్ని పునరుద్ధరించి పర్యాటక కేంద్రంగా మార్చవచ్చని, తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని భక్తులు బలంగా నమ్ముతున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి, అటవీ శాఖ అనుమతులను వేగవంతం చేయాలని, ఆలయానికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.



బీటలు వారి, పెచ్చులూడిన రేకులకుంట మల్లన్న ఆలయం

'గీతం'కు ప్రపంచస్థాయిలో ప్రత్యేక గుర్తింపు

టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో చోటు

పటాన్‌చెరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : యూకేలోని టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇంపాక్ట్ ర్యాంకింగ్స్ 2025లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం చోటు దక్కించుకుని ప్రపంచ గుర్తింపు సాధించిందని డైరెక్టరేట్ ఆఫ్ అక్రిడిటేషన్, ర్యాంకింగ్స్ గర్వంగా ప్రకటించింది. ఈ మేరకు డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.రాజా ప్రభు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో (ఎస్‌డీజీ) ప్రధాన మైలురాయికి చేరుకుని గీతం ర్యాంకు పొందడం విశేషమని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అతి తక్కువ విశ్వవిద్యాలయాలు మాత్రమే ఈ ప్రత్యేకతను సాధించాయని ఆయన పేర్కొన్నారు. స్థిరత్వం, విద్యా నైపుణ్యం, సామాజిక ప్రభావం పట్ల గీతం నిబద్ధతను ఈ విజయం స్పష్టం చేస్తుందని ప్రొఫెసర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా, ఏడు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో, వంద ఉత్తమ ప్రపంచ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా గీతం గుర్తింపు పొందడం ఈ ఏడాది ర్యాంకింగ్స్‌లో ఒక విశిష్ట విజయంగా నిలిచిందని పేర్కొన్నారు. సరసమైన, స్వచ్ఛమైన శక్తి (అఫర్డేబుల్ అండ్ క్లీన్ ఎనర్జీ) విభాగంలో గీతం 81వ ర్యాంకు సాధించిందని, ఇది సంస్థ ప్రయాణంలో అద్భుతమైన ఘనతగా అభివర్ణించారు. గత నాలుగేళ్లుగా ఈ ర్యాంకింగ్స్‌లో గీతం స్థిరమైన పురోగతిని ప్రదర్శిస్తోందని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీల్లో 'ఈసీసీ డే'

చిన్నారులతో పాటు అమ్మల సందడి

ప్రతీ నెలా ఒకరోజు భాగస్వామ్యం

అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ

సిద్దిపేట జిల్లా వివరాలు	
అంగన్‌వాడీ కేంద్రాలు	1,150
ఏడాదిలోపు పిల్లలు	7,027
మూడేళ్లలోపు	25,503
3-6 లోపు	15,359

సిద్దిపేట అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు నూతన విద్యా విధానంపై అవగాహన కల్పించేందుకు రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో ఐసీడీఎస్ ఈసీసీ డే (ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్) కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా చిన్నారుల్లో ఆటపాటలు, కథల ద్వారా విజ్ఞానాన్ని అందిస్తారు. తల్లిదండ్రులను కూడా భాగస్వామ్యం చేస్తూ సృజనాత్మకతను పెంపొందించడానికి ఐసీడీఎస్ కృషి చేస్తోంది. దీనికి సంబంధించి అంగన్‌వాడీ టీచర్లకు ఈ నెల 29 వరకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

నెలకు ఒకసారి అమ్మలు కూడా..

'ఈసీసీ డే' కార్యక్రమంలో భాగంగా ప్రతీ అంగన్‌వాడీ పరిధిలో నెలకు ఒకసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ రోజున పిల్లలతో పాటు తల్లులకు కూడా ఆటల పోటీలు పెడుతున్నారు. నెలరోజుల పాటు పిల్లలకు నేర్పించిన కథలు, ఆటలను ఆ రోజు ప్రదర్శింపజేస్తూ తల్లులను కూడా భాగస్వామ్యం చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల తల్లులు పిల్లలతో మమేకం కావడంతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాలపై చిన్నారులకు ఆసక్తి పెరుగుతుందని, తద్వారా సమాజంలో అవసరమైన మెలకువలను నేర్చుకోవడానికి అవకాశం ఉంటుందని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. ఇది పిల్లల్లో సామాజిక నైపుణ్యాలను, భావోద్వేగ వికాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



చిన్నారులను చేర్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

'రిలయన్స్' వినూత్న ప్రయత్నం

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్యను పెంచడానికి రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆట బొమ్మలు, వివిధ రకాల వస్తువులను అందిస్తున్నారు. వీటిని ఉపయోగిస్తూ పిల్లలకు కథలు, ఆటలు నేర్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఒక్కొక్క సెక్టార్ పరిధిలో ఒక్కో కేంద్రాన్ని ప్రాజెక్టుగా ఎంచుకుని రిలయన్స్ ఫౌండేషన్ విద్యార్థులకు కావలసిన వస్తువులను అందిస్తున్నది.

ప్రైవేట్ పాఠశాలల ప్రభావం

సాధారణంగా రెండున్నర సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల వరకు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలి. అయితే, మూడు సంవత్సరాల పిల్లలు కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం లేదని టీచర్లు, సిబ్బంది చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం తల్లిదండ్రులు తమ పిల్లలను మూడేళ్ల నుంచే ప్రైవేటు పాఠశాలలకు పంపడానికి ఆసక్తి చూపడమే. ఇలా చిన్నతనంలోనే పిల్లలను ప్రైవేట్ బడులకు పంపడం వల్ల వారిపై మానసిక భారం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆటపాటల ద్వారా, సృజనాత్మక పద్ధతుల్లో చదువు గురించి తెలుసుకోకుండానే ప్రైవేట్ పాఠశాలలకు పంపడం వల్ల పిల్లలపై అధిక ఒత్తిడి పెరుగుతుంది. నిర్ణీత వయస్సు వరకు అంగన్‌వాడీ కేంద్రంలో ఉంచడం వలన పిల్లలకు అన్ని అంశాలపై అవగాహన కలగడంతో పాటు, ప్రభుత్వ పథకాల ద్వారా పౌష్టిక ఆహారం కూడా అందే అవకాశం ఉంది. సిద్దిపేట జిల్లా పరిధిలో అనేక గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలల ఆధిపత్యంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. దీనిపై అధికారులు దృష్టి సారించి, అంగన్‌వాడీల ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఈసీసీ డే కార్యక్రమంలో భాగంగా చిన్నారులు, అమ్మలకు ఆటలు ఆడిపిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు





రైతులకు యూరియా కష్టాలు

- ఇష్టారీతిన వ్యవహరిస్తున్న ఫర్టిలైజర్ షాపుల యజమానులు
- వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం

దౌల్తాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఈ వానాకాలంలో కొంతమంది రైతులు రోహిణి కార్తెకు ముందే పంటలను సాగు చేశారు. పలుచోట్ల డ్రిప్, స్ప్రింక్లర్ల సాయంతో మొక్కజొన్నను వేయగా, ఇప్పుడు పంటకు మొదటి దఫా యూరియా వేయాల్సిన సమయం వచ్చింది. రైతులు ఫర్టిలైజర్ షాపులకు వెళ్తే, యూరియా లేదు అని తెగేసి చెబుతున్నారు. ఒకవేళ ఉన్నా, తమ వద్ద ఇతర ఎరువులు, విత్తనాలు కొంటేనే ఇస్తామని షరతులు విధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఇలాంటి మాటలే ఎక్కువగా వినిపిస్తున్నాయి.

అగ్రోస్, సొసైటీ ఉన్నా తప్పని తిప్పలు

దౌల్తాబాద్‌లో ఒక అగ్రోస్ కేంద్రం, ఒక సొసైటీ ఉన్నా యూరియా కష్టాలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో ఎక్కువగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఎంత యూరియా అవసరమో వ్యవసాయ శాఖ అధికారులు ముందుగా అంచనా వేయకపోవడం వల్లే ప్రతిసారీ ఈ కొరత తలెత్తుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతోనే ఎరువుల కొరత తీవ్రమవుతోందని అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి, అగ్రోస్, సొసైటీలలో సరిపడా యూరియా నిల్వ ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు.

అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు

యూరియా కొరతకు తోడు, మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణదారులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు అమ్ముతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షణ చేయకపోవడం, ఇష్టారీతిన వ్యవహరిస్తున్నా దుకాణదారులపై చర్యలు తీసుకోకపోవడమే దీనికి ప్రధాన కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల పెట్టుబడి వ్యయం పెరిగి, తీవ్రంగా నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల వైఫల్యం

యూరియా సరఫరాలో జాప్యం, దుకాణదారుల అక్రమ దందాలపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలి. ప్రతి సీజన్‌లో యూరియా కొరత అనేది సాధారణమైపోయింది. సరైన ప్రణాళిక లేకపోవడం, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టలేకపోవడం అధికారుల వైఫల్యాన్ని స్పష్టం చేస్తోంది. పంటలకు అవసరమైన సమయంలో ఎరువులు అందకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇది రైతులను మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తుంది. కాబట్టి, అధికారులు తక్షణం స్పందించి, యూరియా కొరత లేకుండా చూడాలని, అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

లయన్స్‌క్లబ్ ఆఫ్ మహతి కార్యవర్గం

గజ్వేల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ లయన్స్ క్లబ్ ఆఫ్ మహతి నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని గజ్వేల్ పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ విజయలక్ష్మి, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నర్సింహారాజు, రీజియన్ చైర్మన్ సంజయ్‌గుప్తా ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మహతి అధ్యక్షురాలిగా డాక్టర్ శైలజ, కార్యదర్శిగా సుజాత, ట్రెజరర్‌గా స్రవంతి, కార్యవర్గసభ్యుల ప్రమాణస్వీకారం చేశారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

గజ్వేల్/కుకునూరుపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం కొత్తగా తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీకి చెందిన మెప్మా ఆర్పీలు, అంగన్‌వాడీలు గజ్వేల్ సీడీపీవో ప్రాజెక్టు కార్యాలయంలో సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేఖ విధానాలకు నిరసనగా జూలై 9న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుకునూరుపల్లి సీఐటీయూ మండల అధ్యక్షుడు భోగి సాయికుమార్ ఆధ్వర్యంలో లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

కళాకారుల రాష్ట్ర కార్యదర్శిగా రాజు

సిద్దిపేట కల్చరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ కళాకారుల రాష్ట్ర కార్యదర్శిగా నారాయణరావుపేట మండల కేంద్రానికి చెందిన ఉద్యమ కళాకారుడు తునికి రాజును ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కళాకారుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పిన్నింటి దాసు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది.

రథయాత్రను జయప్రదం చేయండి

సిద్దిపేట కల్చరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జగన్నాథ రథయాత్రను సిద్దిపేటలో నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ఆలయ ప్రతినిధి రంగతీర్థదాస్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఒరిస్సా రాష్ట్రంలో మాత్రమే జరిగే జగన్నాథ రథయాత్రను హరేకృష్ణ సత్సంగం ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా సిద్దిపేటలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 29న సిద్దిపేట వెంకటేశ్వర దేవాలయం పక్కన ఉన్న శ్రీనివాస ధ్యాన మందిరం నుండి మధ్యాహ్నం మూడు గంటలకు రథయాత్ర ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

హుస్నాబాద్‌ను భార్గవాపురంగా మార్చాలని సైకిల్ యాత్ర

హుస్నాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పేరును భార్గవాపురంగా మార్చాలని కోరుతూ శుక్రవారం పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం నుంచి సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ యాత్రను భార్గవాపురం సాధన సమితి కన్వీనర్ గంగిశెట్టి గాంధీ జెండా ఊపి ప్రారంభించారు. కాకతీయుల కాలంలో హుస్నాబాద్ భార్గవాపురంగా పిలిచేవారని తెలిపారు.

గర్భిణులకు అవగాహన

చేర్యాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఆర్యజనని సంస్థ సహకారంతో చేర్యాల పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వాసవీగార్డెన్స్‌లో గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు అధికసంఖ్యలో హాజరయ్యారు. సంపూర్ణ ఆరోగ్యం కలిగి సాధారణ ప్రసూతులు పొందేందుకు గర్భిణులు పాటించాల్సిన పద్ధతులు, సూచనలను సంస్థ ప్రతినిధులు వివరించారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్త

మద్దూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని ఎస్‌ఐ షేక్ మహబూబ్ అలీ తెలిపారు. శుక్రవారం దూళిమిట్ట మండలం శిబ్బితండాలో స్థానికులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామ ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 కాల్ చేయాలని సూచించారు.

కేవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోటార్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

నంగునూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కేవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కేవీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్ రావు యువతి యువకుల కోసం ఉచిత మోటార్ కారు డ్రైవింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు, యువతకు ఉపాధి కల్పించే మార్గాల కోసం కేవీఆర్ ఫౌండేషన్ ముందుంటుందన్నారు, ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు,

నైట్ వాచ్ ఉమెన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మర్కుక్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ మర్కుక్‌లో నైట్ వాచ్ ఉమెన్ పోస్టుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో వెంకట్‌రాములు కేజీబీవీ ఎస్‌వో భాగ్యలక్ష్మి తెలిపారు. కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. 10వ తరగతి ఉత్తీర్ణులై స్థానికంగా ఉండే మహిళకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగులు కేజీబీవీ మర్కుక్ మండల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

అద్దె భవనాల్లో ఇంకెన్నాళ్లు?

- కొమురవెల్లి మండలంగా ఏర్పాటై పదేళ్లు పూర్తి
- నేటికీ అద్దె భవనాలు.. అరకొర వసతుల మధ్య ప్రభుత్వ కార్యాలయాలు
- అధికారులు, ప్రజలకు ఇక్కట్లు
- సమీకృత భవన సముదాయం ఏర్పాటు చేయాలని డిమాండ్



ఇరుకు సందులో అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం



దేవస్థానం గెస్ట్‌హౌజ్ భవనంలో ఎంపీడీవో కార్యాలయం

కొమురవెల్లి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం ఏర్పాడి దాదాపు పదేళ్లు గడిచినా, మండల కార్యాలయాలు ఇంకా అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ కొనసాగుతున్నాయి. మండలానికి కీలకమైన తహసీల్దార్ కార్యాలయం ప్రైవేట్ భవనంలో ఇరుకు సందులో కొనసాగుతుండగా, ఏంపీడీవో కార్యాలయం స్థానిక మల్లన్న దేవస్థానం గెస్ట్‌హౌస్ భవనంలో కొనసాగిస్తున్నారు. వ్యవసాయ, ఎంఈవో కార్యాలయాలు లేనేలేవు. వ్యవసాయశాఖ కార్యకలాపాలు రైతు వేదికల్లో కొనసాగిస్తుండగా, ఎంఈవో కార్యాలయ పనులు స్థానిక ఉన్నత పాఠశాల నుంచి నిర్వహిస్తున్నారు.

తహసీల్ కార్యాలయం ఖాళీ చేయాలంటూ ఒత్తిడి

ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ఖాళీ చేయాలంటూ యజమాని అధికారులకు తెలిపాడు. దీంతో అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ భవనాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

సమీకృత భవనం మంజూరుతోనే పరిష్కారం

కొమురవెల్లి మండలంలో అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండే విధంగా సమీకృత భవనాన్ని ప్రభుత్వం మంజూరు చేసి నిర్మిస్తేనే మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు సమకూరే అవకాశం ఉంది. సమీకృత భవనం నిర్మాణం వల్ల అధికారులు అందరూ ప్రజలకు ఒకే దగ్గర అందుబాటులో ఉండటంతో పాటు ప్రజలకు సౌకర్యంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తహసీల్ కార్యాలయం తరలింపునకు అనుమతి

ప్రస్తుతం కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయాన్ని ఖాళీ చేయాలంటూ ఇటీవలే భవన యజమాని మాకు చెప్పారు. అందుబాటులో ఉన్న భవనాలను పరిశీలించి గతంలో పోలీస్‌స్టేషన్ కొనసాగిన దేవస్థానం గెస్ట్‌హౌజ్ భవనంలోకి మారేందుకు కలెక్టర్‌కు విన్నవించగా అనుమతించారు. కానీ ఆలయ పరిధిలోని భవనం కాబట్టి ఈవో ఆ శాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారి నుంచి ఆమోదం రాగానే తహసీల్దార్ కార్యాలయాన్ని అక్కడికి తరలించి అక్కడి నుంచే కార్యకలాపాలను నిర్వహిస్తాం.

-జి.దివ్య, కొమురవెల్లి తహసీల్దార్



సిద్దిపేట రూరల్: ఇర్కోడులో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేస్తున్న పూజల హరికృష్ణ



తొగుట: ఘనపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటికి భూమిపూజలో చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పనులకు భూమిపూజ



గజ్వేల్‌లో ఇందిరమ్మ ఇంటి పనులను ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

సిద్దిపేట రూరల్/దుబ్బాక/తొగుట/గజ్వేల్/కొండపాక/జగదేవ్‌పూర్/నంగునూరు/దౌల్తాబాద్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పనులను శుక్రవారం స్థానిక అధికారులు నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ పేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. మొదటి విడతలో పేరు రాని అర్హులైన ప్రతి ఒక్కరికీ రెండో విడతలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సిద్దిపేట రూరల్ మండలం ఇరుకోడు, తోర్నాల, రాంపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పనులను నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ స్థానిక అధికారులతో కలిసి భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకట్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. దుబ్బాక, తొగుట మండలాల్లోని పలు గ్రామాల్లో దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. దుబ్బాక మండలం గంబీర్‌పూర్, పోతారం, పెద్దచీకోడు, కమ్మర్‌పల్లి, మల్లాయపల్లి, దుబ్బాకలోని 1వవార్డు, 20 వవార్డుతోపాటు తొగుట మండలం ఘనపూర్, కాన్గల్ లింగాపూర్, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేసి ముగ్గు పోయగా శ్రీనివాస్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఆయన వెంట ఆత్మకమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కూడవెళ్లి చైర్మెన్ రాజిరెడ్డి, తొగుట మండల పార్టీ అధ్యక్షుడు స్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధితో పాటు జగదేవ్‌పూర్, కొండపాక తదితర మండలాల్లోని గ్రామాల్లో డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 2, 13వ వార్డులలో, కొండపాక మండలంలోని వెలికట్ట, సిరసనగండ్ల గ్రామాలతో పాటు జగదేవ్‌పూర్ మండలంలోని పీర్లపల్లి, మాదాపూర్, పలుగుగడ్డ, దౌలాపూర్ గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల భూమిపూజలో నర్సారెడ్డి పాల్గొని పనులను ప్రారంభించారు. కొండపాకలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ కమిషనర్ బాలకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూమిరెడ్డి, కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ పరశురాములు, గజ్వేల్ ఏఎంసీ చైర్మెన్ వంటేరు నరేందర్‌రెడ్డి ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు. నంగునూరులో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, దౌల్తాబాద్ మండలంలోని సూరంపల్లి గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు తలారి నర్సింహులు ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు.

ఆలయాల్లో అమ్మవార్లకు మహిళల కుంకుమార్చన



సిద్దిపేటలో మహా మైసమ్మకు మహిళల కుంకుమార్చన



చేర్యాల: దుర్గమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చన

సిద్దిపేట కల్చరల్/చేర్యాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మహోత్సవ బోనాల పండుగ సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని ప్రశాంత్ నగర్ శ్రీ మహా మైసమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొని, అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. శని, ఆదివారాల్లో ప్రత్యే పూజలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. చేర్యాల పట్టణ శివారులోని దుర్గమ్మ ఆలయంలో శాకంబరీ నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండవరోజూ విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేపట్టారు.

డీజీపీకి పూల మొక్కను అందజేసిన సీపీ



డీజీపీ షానవాజ్ ఖాసీంకు పూల మొక్కను అందజేస్తున్న సీపీ

సిద్దిపేట క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలకు శుక్రవారం వచ్చిన డీజీపీ (డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్, ఎన్ఫోర్స్‌మెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్) షానవాజ్ ఖాసింను సీపీ అనురాధ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

పీజీ కెమిస్ట్రీ ఎంట్రెన్స్‌కు ఉచిత కోచింగ్

సిద్దిపేట కల్చరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం వారు, ఆసక్తిగల డిగ్రీ కెమిస్ట్రీ విద్యార్థులకు పీజీ కెమిస్ట్రీ ఎంట్రెన్స్ కొరకు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సునీత తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెమిస్ట్రీ సబ్జెక్టును ఎంపిక చేసుకున్నవారు ఈ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కెమిస్ట్రీ విభాగ అధిపతి డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ కెమిస్ట్రీ ద్వారా విద్యార్థులకు భవిష్యత్తులో ఫార్మా రంగంలో ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు రిజిస్ట్రేషన్ కొరకు పీజీ కోచింగ్ కన్వీనర్ డాక్టర్ మనోహర్‌ను సంప్రదించాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ అయోధ్య రెడ్డి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ మధుసూదన్ రెడ్డి, సీఓఈ గోపాల సుదర్శనం మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు.

నల్లపోచమ్మ ఆలయ అభివృద్ధికి రూ.31లక్షలు

చేర్యాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ ఆలయ సమీపంలోని చేర్యాల మండలం నాగపురి గ్రామపరిధిలోని నల్లపోచమ్మ ఆలయాభివృద్ధికి ప్రభుత్వం సీజీఎఫ్ నిధులు రూ.31లక్షలు మంజూరు చేసింది. సుమారు 15ఏళ్ల క్రితం నల్లపోచమ్మ ఆలయాభివృద్ధికి సుమారు రూ.25లక్షలు నిధులు మంజూరవడంతో పనులు చేపట్టారు. అర్ధాంతరంగా నిలిచిపోవడంతో పట్టించుకునేవారు లేక నిధులు మళ్లిపోయాయి. కొన్ని నెలలక్రితం ఆలయ పాలకమండలి నియామకమైన నేపథ్యంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, పాలకమండలి చైర్మన్ గూడెపు మహేశ్, బీసీ నాయకుడు భీమ లక్ష్మణ్ తదితరులు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సీజీఎఫ్ ద్వారా రూ.31లక్షలు నిధులు మంజూరుకావడంతో దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తద్వారా ఆలయం అభివృద్ధి చెందుతుందని స్థానికులు, భక్తులు హర్షం వెలిబుచ్చుతున్నారు.

ఉద్యాన పంటలతో అధిక దిగుబడి సాధ్యం

ములుగు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలు సాగు చేస్తే రైతులకు అధిక దిగుబడి వస్తాయని ఉద్యాన విశ్వవిద్యాలయ సహాయ సంచాలకులు డాక్టర్ మల్లేష్ అన్నారు. శుక్రవారం ములుగులో రైతులకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ సెంటర్ జీడిమెట్ల ఆధ్వర్యంలో ఉద్యాన పంటల వ్యవసాయ పద్ధతులపై ఒక రోజు రైతు శిక్షణ నిర్వహించారు. డాక్టర్ మల్లేష్ కూరగాయల పంటలలో వచ్చే పురుగులు మరియు వ్యాధుల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అండగా..



కోహెడ మండలం సముద్రాలలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతుతో మాట్లాడుతున్న మంత్రులు

(5వ పేజీ తరువాయి)

వారం రోజుల్లో మంజూరు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి కోరుకుంటున్న గౌరవెల్లి ప్రాజెక్టును సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఈ సంవత్సరంలో పూర్తి చేసి రైతాంగానికి నీరందిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హామీ ఇచ్చారు. వ్యవసాయ గిడ్డంగులు కూడా మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సీపీ అనురాధ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, కమిషనర్ మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యం : మంత్రి పొన్నం

ఎన్నికల ముందు హుస్నాబాద్ గౌరవాన్ని పెంచుతానని హామీ ఇచ్చాను. అన్నట్లుగా ఈనియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్‌కు 50 సీట్ల మెడికల్ పీజీ కళాశాల మంజూరు చేయడంపై మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. ఈయేడు గౌరవెల్లి ప్రాజెక్టులో నీటిని నింపుతామన్నారు.

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

హుస్నాబాద్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహలు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రూ. 11.50 కోట్లతో నిర్మించిన 50 పడకల మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రూ.82 కోట్లతో నిర్మించే 150 పడకల ఆసుపత్రి భవనానికి, రూ.77.20 కోట్లతో నిర్మించే రాజీవ్ రహదారి కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు ఉన్న రెండు వరుసల రహదారిని నాలుగు వరుసలు అభివృద్ధి చేసే పనులకు శంకుస్థాపన చేశారు.

మంత్రులకు అడుగడుగునా నీరాజనం..

హుస్నాబాద్ పర్యటనకు వచ్చిన నలుగురు మంత్రులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అడుగడుగునా నీరాజనం పలికారు. హుస్నాబాద్‌కు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోహెడ మండలం బస్వాపూర్‌లో మంత్రులకు ఘన స్వాగతం పలికి అక్కడి నుంచి హుస్నాబాద్ వరకు కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.పట్టణంలోని వీధుల గుండా ర్యాలీ ఆసుపత్రి వరకు సాగింది. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు చెక్కులను అందించారు. కాగా అంతకు ముందు కోహెడ మండలంలోని సముద్రాల గ్రామంలో వీరెల్లి కొమురరెడ్డి 11 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఇప్పటివరకు 15 టన్నుల ఆయిల్ పామ్ గెలలు కటింగ్ చేసి దాదాపు రూ. లక్షా15 వేల లాభం అర్జించినట్టు ఆ రైతు మంత్రులకు వివరించాడు. కొత్తగా ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఒక మంచి మార్గదర్శకుడిగా సదరు రైతును మంత్రులు అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 13 మంది వాహనదారులు పట్టుబడ్డారు. పట్టుబడినవారిని శుక్రవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ అనంతరం 13 మందికి రూ.24వేల జరిమానా విధించారు.

వ్యాయామ విద్యకు ప్రాధాన్యత పెరిగింది: డీఈవో

సిద్దిపేట కల్చరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో వ్యాయామ విద్యకు ప్రాధాన్యం పెరిగిందని, విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రీడలను భాగంగా చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలుగుతారని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మానవ వనరుల కేంద్రంలో పేటాటీ ఎస్ సిద్దిపేట ఆధ్వర్యంలో రూపొందించిన వ్యాయామ విద్య స్టాక్ రిజిస్టర్లను శుక్రవారం డీఈవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు వ్యాయామ విద్యే మార్గమన్నారు. రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో సిద్దిపేట జిల్లా నుంచి మరింతమంది క్రీడాకారులు ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పేటా టీఎస్ అధ్యక్షుడు తోట సతీష్, ప్రధాన కార్యదర్శి కదుర్ల హరికిషన్, డీసీఈబీ సెక్రటరీ శౌకత్ అలీ, రాజమోహన్‌గౌడ్, బాబు, లతీఫ్, ప్రవీణ్, కనకారెడ్డి, రవీందర్, దేవరాజ్, భరత్‌రెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఐఈవోను సన్మానించిన గెస్ట్ లెక్చరర్లు

సిద్దిపేట కల్చరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఉత్తమ డీఐఈవోగా అవార్డు అందుకున్న సిద్దిపేట ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ రెడ్డిని గెస్ట్ లెక్చరర్లు శుక్రవారం సన్మానించారు. ఈ నెల 26న హైదరాబాద్‌లోని ఇంటర్మీడియట్ బోర్డులో ఎడ్యుకేషనల్ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా, ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్ శ్రీకృష్ణ ఆదిత్య చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ నేపథ్యంలో సిద్దిపేట డీఐఈవో కార్యాలయంలో గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. అనంతరం గెస్ట్ లెక్చరర్స్ సమస్యల గురించి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ దేవయ్య, జిల్లా ఇన్‌చార్జి టి. మల్లికార్జున్‌శర్మ, జిల్లాసెక్రెటరీ చంద్రమోహన్, సభ్యులు సంపత్, కార్తీక్, ప్రేమ్ కుమార్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రిమ్మనగూడలో మురికినీటిని పారబోయించి అవగాహన కల్పిస్తున్న అధికారి

గజ్వేల్ రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రిమ్మనగూడ గ్రామంలో డ్రైడే ఫ్రైడేలో భాగంగా గ్రామపంచాయతీ నుంచి దాతర్‌పల్లి రోడ్డు వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మురికి నీటి గుంతలు లేకుండా ప్రజలను చైతన్యవంతులను చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో ప్రేమ్‌చందర్, విలేజ్ సెక్రటరీ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్స్ వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.


మునిసిపాలిటీపై బీజేపీ జెండాను ఎగురవేద్దాం



మాజీ ఎంపీటీసీకి కండువకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మెదక్ ఎంపీ

గజ్వేల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీపై బీజేపీ జెండాను ఎగురవేయాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణానికి చెందిన మాజీ ఎంపీటీసీ పంజాల ప్రశాంతిరాజుగౌడ్ కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలోకి చేరగా, ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. వెంట బీజేపీ పట్టణాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, నాయకులు వెంకట్‌రెడ్డి, నత్తి శివకుమార్ తదితరులు ఉన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన మెరీడియన్ విద్యార్థులు




పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ దినేష్

సిద్దిపేట కల్చరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలో మెరీడియన్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. లాంగ్ జంప్ అండర్ 14 విభాగంలో 8వ తరగతి చదువుతున్న హరిసా కౌరిన్ బంగారు పతకం సాధించింది. పరుగు పందెం అండర్ 14 విభాగంలో 8వ తరగతి షాద్మాన్ కాంస్య పతకం కైవసం చేసుకుంది. 4వ తరగతి ఆద్యకు పరుగుపందెంలో కాంస్యం, 3వ తరగతి హర్షిత్ రెడ్డికి అండర్ 10 విభాగంలో స్టాండింగ్ బ్రాండ్ జంప్‌లో కాంస్య పతకాన్ని దక్కించుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

కాంగ్రెస్‌తో పేదల సొంతింటి కల సాకారం

బెజ్జంకి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమం కోసం పథకాలను ప్రవేశపెట్టి నిరుపేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముక్కిస రత్నాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఏఎంసీ చైర్మన్ పులికృష్ణతో కలిసి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించడాన్ని ఖండిస్తున్నామన్నారు. పార్టీలకతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరిగిందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలని లేదంటే ప్రజలే తగిన బుద్ధి చెపుతారని హెచ్చరించారు.

అంధకారంలో వై జంక్షన్



కొమురవెల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వై జంక్షన్ సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలపై రాత్రిపూట లైట్లు వెలగక పోవడంతో అంధకారంగా మారిం ది. మల్లికార్జున స్వామి దర్శనానికి భక్తులు నిత్యం ఈ జంక్షన్ గుండానే వస్తుంటారు అంతేకాకుండా మండల ప్రజలతో పాటు పరిసర ప్రాంత ప్రజలు కుడా నిత్యం ఈ జంక్షన్ గుండానే హైదరాబాద్‌కు ప్రయాణిస్తుంటారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరగకుండా హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.